క్లుప్తంగా

వెంకన్నను దర్శించుకున్న కోలగట్ల



తిరుమల వేంకటేశ్వరస్వామిని సన్నిధిలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం దర్శించుకున్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. స్వామిని దర్శించుకున్న వారిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం నాయకులు సంగంరెడ్డి బంగారునాయుడు, ఆడారి నగేష్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్



కొత్తపేటలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేటలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోమవారం పర్యటించి, పింఛన్ల పంపిణీని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ గిడుతూరి రామారావుతో మాట్లాడుతూ, మండలంలో పింఛన్ల పంపిణీ తీరుపై ఆరా తీశారు. ఇంటింటికీ వెళ్లి శతశాతం పింఛన్లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యకళ, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల కస్పా ఉన్నత పాఠశాలలో 2004లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. అప్పటి గురువులను సత్కరించి గురుభక్తి చాటుకున్నారు.

చిన్నారులను రక్షించాలి..



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

పూసపాటిరేగ: అతిసార నుంచి పిల్లలను రక్షించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రమీలాదేవి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అతిసార నివారణ మాసోత్సవాల నేపథ్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐదేళ్ల లోపు చిన్నారులకు అతిసార వ్యాధి రాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. మండల పరిధిలో ఐదేళ్ల లోపు ఆరు వేల మంది పిల్లలున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, ఆర్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

కారులో పింఛన్ల పంపిణీపై అభ్యంతరం



కారు వద్ద పింఛన్ స్లిప్పులు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి పంచాయతీలో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు కారులో పింఛన్లు పంపిణీ చేశారని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నారాయణరావు ఆరోపించారు. ఈ మేరకు సర్వేయర్ రాజేష్, మహిళా పోలీస్ గౌతమిపై తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించాల్సి ఉండగా.. సిబ్బంది కారులో తిరుగుతూ ఇవ్వడం సరికాదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ ధర్మరాజు వివరణ కోరగా.. వారికి కేటాయించిన లబ్ధిదారులకు అనుకున్న సమయానికే సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారన్నారు. స్లిప్పులు పంపిణీ చేసేటప్పుడు మాత్రం కారులో వెళ్లినట్లు సిబ్బంది చెప్పారని తెలిపారు.

పెట్టుబడి సాయం అందించాలి



నిరసన చేపడుతున్న రైతు సంక్షేమ సంఘ సభ్యులు

- రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు వేమిరెడ్డి డిమాండ్

విజయనగరం అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సన్నద్ధమైన రైతులకు వెంటనే పెట్టుబడి సాయం అందించాలని జిల్లా రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర సాధన సమితి పేరుతో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ రాకముందే మే, జూన్ నెలల్లోనే రైతులకు పెట్టుబడి సాయం అందించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే నగదు సాయం అందించాలని కోరారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



పాఠశాలను బాగు చేయాలని కోరుతున్న ఊడికలపేట గ్రామస్తులు

పాఠశాలను బాగు చేయండి..

డెంకాడ మండలం ఊడికలపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం అధ్వానంగా మారిందని, వెంటనే బాగు చేయాలని కోరుతూ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షానికీ ప్రాంగణం మునిగిపోతోందని, వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కోటసత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



కుంకుమార్చనలలో పాల్గొన్న మహిళలు

విజయనగరం టౌన్: పట్టణంలోని రామానాయుడు రోడ్డులో కొలువైన కోట సత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఒబ్బిశెట్టి రాంజీ మాట్లాడుతూ, ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి వేకువజామునుంచే పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టామన్నారు. మంగళవారం సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి మేళతాళాలతో, బాణాసంచా, విచిత్ర వేషధారణలతో నడుమ పట్టణ పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం పెద్దచెరువులో తెప్పోత్సవం ఉంటుందని తెలిపారు. భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు. కార్యక్రమంలో పేర్ల సీతారామయ్యశెట్టి, ఏడుకొండలు, చెక్కా త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం జరిపారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఎ.అప్పలరాజు, జి. అప్పలాచారి, కె. అప్పారావు, వి. చిదంబరం, బి. మోహనరావు, ముంతా ప్రసాద్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



నారాయణపురంలో వైద్య సిబ్బంది ర్యాలీ

- రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణి

విజయనగరం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.శ్రావణి అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభం సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపురంలో డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ, వర్షాలు పడుతున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటితో పాటు వేడి వేడి పదార్థాలు భుజించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మాణిక్యం, పీహెచ్ఎన్ రాముడమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీరామ్మూర్తి, శ్రీనివాసరావు, కళావతి, ఆరోగ్య సహాయకులు కృష్ణ, చిన్నారావు, శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ అప్పలనాయుడు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై ఫిర్యాదు



వినతిపత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం అర్బన్: పట్టణంలోని జర్నలిస్టుల కాలనీలో చోటుచేసుకున్న ఆక్రమణలపై ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌పీ ప్రసాద్, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు, సీనియర్ జర్నలిస్టులు వైఎస్ పంతులు, వేదుల సత్యనారాయణ, చక్రవర్తి, డేవిడ్ రాజు, భరత్, కేవీ రమణ, తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైన కలెక్టర్.. ప్రతీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్‌సెల్) కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని, ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, ఏవో శ్యామ్ సుందర్, పక్కి, పిరిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

విజయనగరం: బీజేపీ నాయకుడు బూర్ల శ్రీధర్ తన పుట్టిన రోజు సందర్భంగా అతని స్వగృహంలో సోమవారం పేదలకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏటా తన పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. ఇతరులు కూడా పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాల సమయంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

సత్కారం



పార్వతి దంపతులను సత్కరిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

నెల్లిమర్ల: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేటర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఎస్. పార్వతిని సహచర ఉద్యోగులు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డి.ధర్మరాజు మాట్లాడుతూ, పార్వతి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు శైలజ, మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ సన్యాసినాయుడు

పూసపాటిరేగ: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టాలను గౌరవించాలన్నారు. నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం

బాడంగి: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని ఏవో కె.శిరీష తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతు ప్రధాన పంట సాగుచేసుకోవడానికి ముందు భూసారం కోసం పచ్చిరొట్టను సాగుచేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట మొక్కలను అదే నేలలో కలియదున్నాలని తద్వారా భూసారం పెరిగి, ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. అలాగే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో–2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని దేవుదళ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని ఆయన సోమవారం సందర్శించి, అక్కడి విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి, వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా, చదువుపై వారికి ఆసక్తి రేకెత్తించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని తెలిపారు.

ఈపీఎఫ్ పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు తదితరులు

బొబ్బిలి: ఈపీఎఫ్ పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు వి.శేషగిరిరావులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో వారు సోమవారం మాట్లాడుతూ ఈపీఎఫ్ పింఛన్‌దారులకు న్యాయం జరిగేలా ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ పెంచాలని కోరుతూ ఆగస్టు 6వ తేదీ నుంచి మూడురోజుల పాటు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు. దేశంలోని 75 లక్షల మంది పెన్షనర్లకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఈపీఎఫ్ పింఛన్.. రాష్ట్రంలో ఇస్తున్న సామాజిక పింఛన్ కన్నా తక్కువగా ఉండడం దారుణమన్నారు. ఈపీఎఫ్ పింఛన్ పెంపు కోరుతూ ఈ నెల 10వ తేదీన అన్ని మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన చేపడుతున్నారు. కార్యక్రమంలో పి.కృష్ణ, భుజంగరావు, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. మంచిరోజులు వస్తాయి..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాజకీయాల్లో గెలుపోటములు సర్వసాధారణమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, మనకు మళ్లీ మంచి రోజులు వస్తాయని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయుకుడు పూడి సత్యంను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి మండల కేంద్రంలో సోమవారం కలిసి పరామర్శించారు. ఆయన అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, టీడీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా ఎవరూ ఏమీ అనవద్దన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అందరం ఒక్కటేనన్న భావనతో అందరూ వ్యవహరించాలని హితవుపలికారు. కూటమి అధికారంలోకి వచ్చిన 15 రోజులకే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12 వినతులు



నగర ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12 వినతులు అందాయి. వ్యక్తిగత, సామాజిక సమస్యలపై పలువురు తమ అర్జీలను కమిషనర్ ఎంఎం నాయుడుకు అందజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఐదు వినతులు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 3, శానిటేషన్‌కు సంబంధించి 2, రెవెన్యూ విభాగానికి సంబంధించి 2 వినతులు అందాయి. ఆయా వినతులను స్వీకరించిన కమిషనర్ ఎంఎం నాయుడు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ అమ్మాజీరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోండి..



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు

- ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు

విజయనగరం: కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కోట వరకు నిర్వహించిన స్టాప్ డయేరియా ర్యాలీని సోమవారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. అలాగే డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో అంటురోగాలు ప్రబలే అవకాశముందన్నారు. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఐదు సంవత్సరాల్లోపు వయసున్న పిల్లలకు డయేరియా సోకే ప్రమాదం ఉందని, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎంఎం నాయుడు, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ప్రజారోగ్య సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



డెంకాడ: అక్కివరంలో పింఛన్ డబ్బులను లబ్ధిదారునికి అందిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి



పూసపాటిరేగ : కొప్పెర్లలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న జేసీ కార్తీక్, తదితరులు

సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం సజావుగా సాగింది. సచివాలయ సిబ్బంది, అధికారులు, టీడీపీ నాయకులు సోమవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదు అందజేశారు. అయితే కొన్నిచోట్ల అందరినీ ఒకేచోటకు తీసుకువచ్చి పింఛన్లు ఇచ్చారు. టీడీపీ, జనసేన నాయకులు ఫొటోలకే అధిక ప్రాధాన్యం ఇస్తూ లబ్ధిదారులతో పదే పదే ఫొటోలు దిగడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం రూరల్: కోరుకొండలో లబ్ధిదారునికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు